క్లుప్తంగా

నేడు ఆరమండలో ఉచిత వైద్య శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఆదివారం పొన్నూరు మండలం ఆర మండలో ఉచిత హృదయ సంబంధ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శనివారం తెలిపారు. ''విద్య –వైద్యం'' రెండూ సమాజానికి కళ్లు వంటివని విశ్వసించే బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాటలో విస్తృత స్థాయిలో చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా వైద్య పరీక్షలతో పాటు వైద్య సహాయాన్ని అందించడం లక్ష్యంగా కొనసాగుతున్నట్లు వివరించారు. మెడ్ స్టార్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై హైదరాబాద్ శ్రీవాణీ కళానికేతన్ నిర్వాహకులు బి. నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో శనివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణశాస్త్రి పలు భక్తి గీతాలు, అన్నమాచార్యుల సంకీర్తనలు గానం చేసి ఆహూతుల్ని ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పాలపర్తి సీతారామాంజనేయశాస్త్రి, కీబోర్డుపై బి.యస్. సత్యదేవ్, తబలాపై పి. శివరామకృష్ణ వాయిద్య సహకారం అందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ



నెహ్రూనగర్: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండవచ్చని రెండో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం ఆమె కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కిట్లను అందుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వివాలో సందడిగా చేనేత దినోత్సవం

పెదకాకాని: జాతీయ చేనేత దినోత్సవాన్ని వివా పాఠశాలలో శనివారం సందడిగా నిర్వహించారు. మంగళగిరికి చెందిన చేనేత పరిశ్రమలు కేకే, టెక్- 7 హ్యాండ్‌లూమ్ సంస్థలు పాఠశాలలో ప్రత్యేక శిబిరాల్ని ఏర్పాటు చేశాయి. చేనేత వస్త్రాల తయారీ, నేత పరికరాలు, నూలు దారాల్ని ప్రదర్శించారు. నేత కార్మికుడు క్రాంతికుమార్ రాట్నం, బొంగరం, అచ్చు, నాడి తదితర పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించారు. మంగళగిరి, పోచంపల్లి, కలంకారీ వస్త్రాల మధ్య వ్యత్యాసాల్ని తెలియజేశారు. స్వాతంత్య్రోద్యమంలో చేనేత ప్రధాన భూమిక పోషించిందని తెలిపారు. పర్యావరణ హితమైన చేనేత వస్త్రాల్ని నిత్య వస్త్రధారణలో భాగం చేసుకోవాలని అధ్యాపకులు, విద్యార్థులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో ఫార్మసీ సవాళ్లపై వ్యాస రచన పోటీలు

గుంటూరు రూరల్: ఫార్మసీ విద్యార్థులంతా ఔషధ పరిశోధన, తయారీ, సంరక్షణ నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు సూచించారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శనివారం 'డిజిటల్ యుగంలో ఫార్మసీ సవాళ్లపై నిర్వహించనున్నవ్యాసరచన పోటీల కరపత్రాల్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్ని తమ కళాశాల మహారాష్ట్రలోని షింగనాపూర్ సంజీవని కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ రీసెర్చ్, ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 5వ తేదీలోగా పూర్తి వివరాలతో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంట్రీ ఫీజుగా రూ. 150 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పేర్లను నమోదు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.చలపతి ఫార్మశీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కౌన్సిల్ తీర్మానాలు, ప్రతిపాదనలకు అధిక ప్రాధాన్యం

మేయర్ కావటి



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: కౌన్సిల్ సమావేశాల్లో కార్పొరేటర్ల ప్రతిపాదనలు, కౌన్సిల్ తీర్మానాల అమలుకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. తన చాంబర్‌లో శనివారం కౌన్సిల్ తీర్మానాలు, ప్రతిపాదనల అమలుపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే ప్రజాప్రతినిధులు గుర్తించిన అభివృద్ధి పనుల్ని కౌన్సిల్‌లో ప్రస్తావిస్తారన్నారు. కౌన్సిల్ తీర్మానాలకు అనుగుణంగా అధికారులు వాటిని అమలు చేసినప్పుడే సమగ్ర నగరాభివృద్ధి సాధ్యమని మేయర్ చెప్పారు. నగరంలో పలు ప్రధాన వీధుల్లో రోడ్డు విస్తరణ పనుల్ని ఆయన సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో విస్తరణ ప్రభావిత భవనాలకు నష్టపరిహారం, టీడీఆర్ బాండ్ల వివరాల్ని అడిగారు.

త్వరితగతిన వంద శాతం బాండ్లు అందజేయాలని ఆయన సూచించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి కోర్టు కేసుల్ని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో పరిష్కరించాలని చెప్పారు. మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజుల్ని నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. నగరంలో ప్రతి హోర్డింగ్, బోర్డులకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని అధికారుల్ని కోరారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రోడ్లపై ఆక్రమణల్ని తొలగించాలని సూచించారు. కౌన్సిల్లో తీర్మానం చేసిన గజిట్ మేరకు వార్డు సచివాలయాల వారీగా నూతన డోర్ నంబర్ల కేటాయింపు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఏసీపీల అశోక్ కుమార్, బాబూరావు, అజయ్ కుమార్, సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, టీపీఎస్‌లు, టీపీవోలు, టీపీబీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



కార్పొరేటర్లతో కలసి పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతమైందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. శనివారం ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన నాడు–నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు నగరంలోని అతి పెద్దదైన ఎస్‌కేబీఎం పాఠశాలను అన్ని హంగులతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్ని గతంలో ఎన్నడూ చూడని విధంగా రూ.కోట్లాది ఖర్చుతో సకల వసతులతో ఆధునీకరిస్తోంది సీఎం వై.ఎస్. జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటేనని తెలిపారు. జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, బలవర్థకమైన పౌష్టికాహారంగా అందిస్తున్న గోరుముద్దతో పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో సంతోషంగా చదువుకుంటున్నారని తెలిపారు. హైస్కూల్ ప్లస్‌గా ఎంపికైన ఎస్‌కేబీఎం పాఠశాలలో నాడు–నేడు పనుల్ని వేగవంతంగా చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, షేక్ రోషన్, ఈపూరి వనజాక్షి, పాఠశాల హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెలసరి సమయంలో పరిశుభ్రత అవసరం



విద్యార్థినులకు న్యాప్కిన్స్ అందజేస్తున్న డాక్టర్ రాజకుమారి

గుంటూరు మెడికల్: నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్యనిపుణులు డాక్టర్ శనక్కాయల రాజ కుమారి సూచించారు. పాత గుంటూరులోని యాదవ్ హైస్కూల్లో శనివారం నెలసరి పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నెలసరి సమయంలో మహిళల అవసరాలకు తగ్గట్లు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసే విధంగా ప్రభుత్వం ఆయా సంస్థ యాజమాన్యాలు, పాఠశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు శానిటరీ న్యాప్కిన్స్ తేలిగ్గా దొరికే వెసులుబాటు ఉందన్నారు. అభివృద్ధి చెందుతున్న ఇండియా, ఆఫ్రికా, చైనా లాంటి దేశాల్లో అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల మహిళలు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె వెల్లడించారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు తూర్పు కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, సురేష్ జైన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

8న ఢిల్లీలో శాంతి ర్యాలీ

నెహ్రూనగర్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడుల్ని అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల ఎనిమిదో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద క్రైస్తవ నాయకులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు తిప్పాబత్తిన గోవింద్ తెలిపారు.నగరంలోని అంకమ్మనగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి శాంతిని నెలకొల్పాలని కోరారు. గుంటూరు నుంచి ఆదివారం మధ్యాహ్నం వందలాది క్రైస్తవ నాయకులతో ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నట్లు చెప్పారు. శాంతి ర్యాలీ అనంతరం ప్రతిపక్ష నాయకులందరినీ కలసి, మణిపూర్ రాష్ట్ర క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరుతామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆధ్యాత్మికత, నైతిక విలువలు అలవర్చాలి



అద్వైత భారతిని అభినందిస్తున్న శివాజీ, విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావం, నైతిక విలువల్ని అలవర్చాలని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూలు గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకటో తరగతి విద్యార్థిని కోడూరి అద్వైత భారతి గత నెల 30న తిరుమల తిరుపతి దేవస్థానం–హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా ''కథ చెబుతారా ఊ కొడతాం'' పేరుతో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. పాఠశాల కరస్పాండెంటు పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పోటీతత్వంతో ముందుకు వెళ్లడం ఎంత అవసరమో, భారత దేశపు ప్రాచీన ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలతో పాటు నైతిక విలువల్ని కొనసాగించడం అంతే అవసరమని తెలిపారు. భారతీయ తాత్వికత అంతా మన కథలు, పురాణాల్లో ఇమిడ్చిన పూర్వీకులు మనకు అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన కోటేశ్వరరావు అప్పులపాలయ్యాడు. ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య ఆశాజ్యోతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల కోసం భార్యను వేధిస్తున్న భర్త

భార్య వేధిస్తున్న భర్తపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురానికి చెందిన వెంకట కృష్ణారావు భార్య దుర్గను డబ్బులు ఇవ్వాలంటూ తరచూ వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వసతి గృహానికి ఒంటరి మహిళ తరలింపు



మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్న మహిళను పట్టాభిపురం పోలీసులు ప్రభుత్వ వసతి గృహానికి తరలించారు. చేబ్రోలు హనుమయ్య ఫ్యాక్టరీ సమీపంలో శనివారం ఓ మహిళ ఒంటరిగా తిరుగుతుందన్న సమాచారం అందుకున్న మహిళ పోలీసులు ఆమెను విచారించారు. పేరు బుజ్జి అని చెప్పింది. తనది తిరుపతి అని, భర్త శంకర్ ఆటోలో తెచ్చి ఇక్కడ వదిలిపెట్టి వెళ్లాడని తెలిపింది. మహిళ పోలీసులు ఆమెను ప్రభుత్వ వసతి గృహానికి తరలించారు. ఫొటోలో చొక్కా ధరించి ఉన్న బుజ్జి వివరాలు తెలిసిన వారు స్టేషన్‌లో లేదా 8688831343 నంబరును సంప్రదించాలని పట్టాభిపురం పోలీసులు కోరారు.

మస్తానయ్య దర్గాలో అంబటి రాయుడు ప్రార్థనలు





విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న అంబటి రాయుడు

పాత గుంటూరు: నగరంపాలెంలోని శ్రీ హజరత్ కాలే మస్తాన్ షావలియా దర్గాను శనివారం ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించారు. మస్తానయ్య బాబావారిని దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని బాబాను ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వ పనితీరు చాలా బాగుందని తెలిపారు. రెండేళ్ల కరోనా కష్ట కాలంలో కూడా రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు. రాబోయే కాలంలో రాష్ట్రం ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల్ని పలుకరిస్తుంటే వారు ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు స్టార్ మస్తాన్, సహాయ కార్యదర్శి షేక్ సుభాని, సభ్యులు మున్నా, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్లా, ముక్తుమ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం పెదకాకాని రోడ్డులోని వాసవీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో వ్యాపారులతో సమావేశమయ్యారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

లక్ష్మీపురం: తూర్పు నియోజకవర్గ పరిధిలోని అంజుమన్ స్కూల్లో విద్యార్థులకు క్రికెటర్ అంబటి రాయుడు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో రాణించాలని సూచించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా మాట్లాడుతూ జగనన్న క్రీడాకారులకు మొదటి నుంచి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. క్రికెట్‌లో రాష్ట్ర జట్టు రాణించేందుకు అనుభవజ్ఞులైన కోచ్‌ల వద్ద శిక్షణ పొందాలని సూచించారు. అంజుమన్ ప్రెసిడెంట్ కర్నుమ, 13వ వార్డు కార్పొరేటరు సంకురి శ్రీనివాస్, 15వ వార్డు కార్పొరేటర్ అజయ్,12వ వార్డు ప్రెసిడెంట్ సలీమ్ భాయ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు

నగరంపాలెం: ఫౌల్ట్రీ ఫారానికి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదుకు గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు అధికారులు ఆదేశించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున అమరావతి పట్టణ పరిధిలోని ధరణికోటలో సిబ్బంది మకాం వేశారు. ఈ క్రమంలో ఆటో, ద్విచక్ర వాహనాలపై సీజేబీ ఫౌల్ట్రీఫారంలోకి పీడీఎస్ బియ్యం బస్తాల్ని అక్రమంగా తరలించడాన్ని గుర్తించి, పట్టుకున్నారు. అందులో మూడు గోతాలపై సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ముద్రలు ఉండగా, మిగతా 21 తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం ఉన్నాయి. బియ్యం సహా వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటో యాజమాని, డ్రైవర్, ద్విచక్ర వాహనదారుడు, ఇద్దరు ఫౌల్ట్రీ యజమానులు, గుమస్తాలపై 6ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎస్‌డీటీ అధికారులకు తెలియజేసినట్లు సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు. తనిఖీల్లో స్థానిక పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేర్‌వెల్‌లో అరుదైన శస్త్రచికిత్స



కోలుకున్న ధనరాజ్‌తో డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: జాండీస్ (పచ్చకామెర్ల వ్యాధి) తో నెల రోజులుగా బాధపడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ క్యాన్సర్ రోగికి అత్యాధునిక పద్ధతిలో అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడామని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ షేక్ నాగూర్ బాషా చెప్పారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులో కేర్‌వెల్ హాస్పిటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూపూడికి చెందిన జి.ధనరాజు జీర్ణకోశ క్యాన్సర్‌తో బాధపడుతూ కామెర్ల బారిన పడ్డాడు. పలు ఆసుపత్రులు తిరిగినా వ్యాధి తగ్గకపోవడంతో ఆగస్టు 1న తమ హాస్పిటల్‌కు వచ్చినట్లు వెల్లడించారు. వైద్య పరీక్షలు చేసి పసరుతిత్తి నాళం నొక్కుకు పోవడంవల్ల జాండీస్ తగ్గడం లేదని నిర్ధారించామన్నారు. పసరుతిత్తికి స్టంట్ వేయడం కుదరదని, ఈనేపథ్యంలో ఈనెల 3న అత్యాధునిక ల్యాప్రోస్కోపీ ద్వారా చిన్నపేగుకు రంధ్రం పెట్టి పసరు తిత్తి నాళం మధ్యలో స్టంట్ వేశామని వివరించారు. కొలిడోకో డ్యూయోడినాస్టమిగా పిలిచే ఈ నూతన వైద్య విధానాన్ని మొట్టమొదటిసారిగా జిల్లాలో తమ హాస్పటల్‌లో చేశామన్నారు. చాలా ఖరీదైన శస్త్రచికిత్సను రోగికి నామమాత్రపు ఫీజుతో చేసినట్లు డాక్టర్ నాగూర్‌బాషా వెల్లడించారు. సకాలంలో ఆపరేషన్ చేయని పక్షంలో లివర్ ఫెయిలై మనిషి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడేదని చెప్పారు. వ్యాధి నుంచి కోలుకోవడంతో శనివారం ధనరాజును డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. అత్యాధునిక వైద్య సేవల్ని నామమాత్రపు ఫీజులతో తమ హాస్పిటల్‌లో అందిస్తున్నామని, ప్రజలు వైద్య సౌకర్యాల్ని వినియోగించుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా కోరారు.

మణిపూర్ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

నెహ్రూనగర్: మణిపూర్ రాష్ట్రంలో బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని పలు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం మణిపూర్‌లో దాడులకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లకు నిరసనగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె మస్తాన్‌వలి మాట్లాడుతూ మణిపూర్, హర్యానాలో జరిగిన సంఘటనలు హృదయాల్ని కదిలిస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు, ప్రజలకు న్యాయం చేయలేని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలని ఆయన కోరారు.

నులి పురుగులు, కళ్ల కలకపై జాగ్రత్త అవసరం



అల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ కృష్ణప్రభ

గుంటూరు రూరల్: చిన్నారుల్లో నులి పురుగుల సమస్య, కళ్ల కలకను ఎదుర్కొనేందుకు జాగ్రత్తలు పాటించాలని నల్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ కృష్ణప్రభ తెలిపారు. ఈనెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం నల్లపాడు కాలేజీ సెంటర్‌లోని బాసర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులతో పాటు స్థానికులకు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణప్రభ మాట్లాడుతూ కళ్ల కలక అనేది వైరస్ లేదా బ్యాక్టీరియా, అలర్జీల వల్ల కలుగుతుందన్నారు. ఇది ఒకరినుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కళ్ల కలకలు వచ్చిన వారు శుభ్రమైన నీటితో కళ్లను కడుక్కోవాలని సూచించారు. చిన్నారుల్లో నులిపురుగుల సమస్య కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల వస్తుందని తెలిపారు. నివారణకు ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలు 400 ఎంజీ అల్బెండజోల్ టాబ్లెట్‌లో సగం కానీ 200 ఎమ్‌జీ టాబ్లెట్ కానీ వేసుకోవాలని సూచించారు. మిగిలినవారు 400 ఎంజీ టాబ్లెట్‌ను వేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అనంతరం చిన్నారులకు, పెద్దలకు 300 మందికి అల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంటు ప్రారంభం



ప్లాంటును ప్రారంభిస్తున్న శ్యాం సుందర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం టీజేపీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంటును పాలకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనం ఎంతగా సంపాదించినా, ఆరోగ్యం అనే సంపద దరిదాపులకు రాదని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే నానుడికి అర్థం ఇదేనని వివరించారు. విద్యార్థుల తాగునీరు పరిశుభ్రంగా ఉండాలనే భావంతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశామని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నుంచి కాపాడటానికి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా సురక్షిత తాగునీటి వ్యవస్థను అందుబాటులో తెచ్చామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కోశాధికారి కృష్ణానంద్, వాసవీ విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పి.సుబ్రహ్మణ్యం, తెల్లాకుల శ్రీనివాసబాబు, వైస్ ప్రిన్సిపాల్ మురళి, డాక్టర్ జె.వి. సుధీర్ కుమార్, డాక్టర్ ఏ.అంజనీ కుమార్, డాక్టర్ పి. దేవేంద్ర గుప్తా, సురేష్ పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు శిక్షణ శిబిరాలు దోహదం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

గుంటూరు రూరల్: శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లోని నూతన ఆలోచన విధానాల్ని మెరుగుపరచవచ్చని లైప్యాక్స్ సంస్థ సీఈవో బి. భరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. నగర శివారు లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గత నాలుగు రోజులుగా ఎథికల్ హ్యాకింగ్‌పై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆలోచనలతో సమాజానికి ఉపయోగకరమైన ప్రయోగాల దిశగా ముందుకు సాగాలని సూచించారు. కళాశాల సెక్రటరీ వై. సుజిత్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులు ఎన్నో మెలకువలు తెలుసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎథికల్ హ్యాకింగ్ టెక్నాలజీని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగగోపి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

పెదకాకాని: మహిళా రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని పీఆర్పీ జి. నాగరాజా సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పెదకాకానిలో శనివారం మండల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేసి, రైతులకు అవగాహన కల్పించారు. పీఆర్పీ నాగరాజా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వాతావరణం కలుషితం కాదని, ఆరోగ్యకర ఉత్పత్తులు సాధించవచ్చని తెలిపారు. మండలంలోని నంబూరు, గోళ్లమూడి గ్రామాల్లోని సంఘాలలో ఇద్దరు లీడర్లు పాయింట్ పర్సన్లుగా ఉన్నారన్నారు. మొదటి లీడరు న్యాచురల్ పాయింట్ పర్సన్‌గానూ, రెండవ లీడర్ కిచెన్ గార్డెన్ పాయింట్ పర్సన్‌గా ఉంటారని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి గానూ శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి పథకాల నుంచి రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, ఏపీఎం రాజు, సీసీలు ఆదిలక్ష్మి, కిరణ్మయి, అరుణ, జెండర్ కమిటీ అధ్యక్షురాలు యశోద, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.